# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 16 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 331

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





త్వరలో మహిళలకు ఉచితబస్సు: మంత్రి

# చట్టబద్ధంగానే విద్యుత్ కొనుగోళ్లు

తెలంగాణలో నిరంతర విద్యుత్ కోసం కృషి

ఈఆర్‌సి నిబంధనలు కాదని కమిషన్ వేయడం చట్టవిరుద్ధం

మా ప్రభుత్వానికి దురుద్దేశాలు అంటకట్టే ప్రయత్నాలు సరికాదు

కమిషన్ ముందుకు వచ్చి వివరణ ఇవ్వాల్సిన పనిలేదు

వీలైతే మీరు రాజీనామా చేసి వెళ్లిపోండి

జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ లేఖ



2లో



# ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు

అక్కడి సీసీ కెమెరాలన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం

ఎఫ్ఎం ద్వారా ట్రాఫిక్ అలర్ట్‌లు

వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, పొంగులేటి, ఉత్తమ్‌లకు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును వివరిస్తున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల ఉన్న నగరాన్ని ఓ యూనిట్‌గా తీసుకొని విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీఎం సందర్శించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఓఆర్ఆర్‌పై ఉన్న సీసీ కెమెరాలన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ఎం రేడియో ద్వారా ట్రాఫిక్ అలర్ట్‌లు చెబుతూ ప్రజలను అప్రమత్తం చేసే ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన మేరకు హోంగార్డుల నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వరద తీవ్రత ఎక్కువగా ఉండే 141 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని పోలీసు అధికారులు వెల్లడించారు. వరద నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు వివరించారు.

రోడ్లపై నీరు నిలవకుండా వాటర్ హార్వెస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉన్నారు.



2 లో

## పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు

ఏపి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశం

నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు

## పాటించాల్సిందే



3లో




2 లో

## ఘనంగా బోనాల జాతర నిర్వహణ

ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రులు



2 లో

## తుమ్మడిహెట్టి ప్రతిపాదన పక్కన పడేశారు

పీసీ ఘోష్ కమిషన్ కు రిటైర్డ్ ఇంజినీర్ల నివేదిక

కాళేశ్వరంపై విచారణ వేగవంతం చేసిన కమిషన్

పిలిస్తే ఎవరైనా విచారణకు రావాల్సిందేనన్న ఘోష్

# నర్సింహారెడ్డిని వైదొలగాలనడం ముమ్మాటికీ ధిక్కరణే

వెంటనే కేసీఆర్‌ను అరెస్ట్ చేసి విద్యుత్ కొనుగోలు అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

తప్పిదాలను ఈఆర్సీపై నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా?

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్/ ఢిల్లీ: చట్టబద్ధ విచారణ కమిషన్‌నే తప్పుపట్టేలా, కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి వైదొలగాలని మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన రాతపూర్వక వివరణ, బెదిరింపులతో కూడిన లేఖ



ముమ్మాటికీ ధిక్కరణకు నిదర్శనమ ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. కమిషన్ నోటీసులకు వివరణ ఇస్తే సరిపోయేదని, అందుకు భిన్నంగా కమిషన్ నియామకాన్ని తప్పుబట్టి చైర్మన్ బాధ్యతల నుంచి వైదొలగాలంటూ సూచించడం దారుణమన్నారు.'ఇది ముమ్మాటికీ ధిక్కరణ కిందకే వస్తుంది. తక్షణమే కేసీఆర్‌ని అరెస్ట్ చేసి విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది' అని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కేసీఆర్‌తో సహా విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, గొర్రెల పంపిణీ స్కాంలలో అవినీతికి పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయడంతోపాటు వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు.

# బిజెపిలో విలీనం కానున్న బిఆర్ఎస్



పురోగతిలో చర్చలు ..త్వరలోనే ప్రక్రియ పూర్తి

మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**సూర్యాపేట:** బీజేపీలో బీఆర్ఎస్ పార్టీని విలీనం చేసేందుకు చర్చలు జరుగు తున్నాయని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరోలనే బిజెపిలో బిఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని అన్నారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కేసీఆర్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. సంతోష్ రావు, వినోద్ కుమార్, నమస్తే తెలంగాణ ఎండీ దామోదర్, కేటీఆర్ లు కలిసి.. బీఆర్ఎస్ పార్టీని విలీనం చేయడానికి బీజేపీ అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారని అన్నారు. ఎల్ నర్సింహారెడ్డి విచారణ కమిటీని కేసీఆర్ రద్దు చేయడం అనడం విడ్డూరమన్నారు. యాదాద్రి, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లలో కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. త్వరలో ఆధారాలతో సహా నిరూపిస్తామని ఆయన చెప్పారు. కేసీఆర్ హయాంలో గొర్రెల స్కామ్ లో కూడా రూ.7 వందల కోట్ల స్కాం జరిగిందన్నారాయన. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ విచారణ చేపట్టిందని తెలిపారు. ఢిల్లీలో రూ.11 వందల కోట్ల లిక్కర్ స్కామ్ చేసి.. కవిత జైల్లో ఊచల లెక్కబెడుతోందన్నారు.


# ఫోక్సో కేసులో సిఐడి ఎదుట 17న హాజరు

## మాజీ సిఎం యెడ్యూరప్ప వెల్లడి

**బెంగళూరు:** తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి జూన్ 17న దర్యాప్తు కోసం సిఐడి ఎదుట హాజరవుతానని బిజెపి సీనియర్ నాయకుడు, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బిఎస్ ఎడియూరప్ప శనివారం తెలిపారు. శనివారం బెంగళూరు చేరుకున్న ఎడియూరప్ప విలేకరులతో మాట్లాడుతూ తనకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న వారికి ప్రజలు గుణపాఠం నేర్పుతారని అన్నారు. పోక్సో కేసులో ఎడియూరప్ప అరెస్టును నిలుపుదల చేస్తూ కర్నాటక హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అయితే జూన్ 17న దర్యాప్తు నిమిత్తం సిఐడి ఎదుట హాజరు కావాలని ఎడియూరప్పను హైకోర్టు ఆదేశించింది. ముందుగా నిర్ణయించిన కార్యక్రమం కోసం నేను ఢిల్లీకి వెళ్లాను. జూన్ 17న దర్యాప్తు కోసం హాజరవుతానని ముందుగానే లిఖితపూర్వకంగా సమాచారం అందచేశాను. సిఐడి నన్ను అరెస్టు చేయకుండా హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం సిఐడి ఎదుట హాజరవుతాను. గందరగోళం సృష్టించడానికి కొందరు అనవసరంగా ప్రయత్నించారు. ఎవరినీ నిందించదలచుకోలేదు. అందరికీ వస్తావం ఏమిటో తెలుసు అని ఎడియూరప్ప తెలిపారు. నాకు వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడేవారికి ప్రజలు గుణపాఠం చెబుతారు అని కూడా ఆయన హెచ్చరించారు. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్(పోక్సో) చట్టం కింద ఈ ఏడాది మార్చి 14న ఎడియూరప్పపై కేసు నమోదైంది. ఈ నెల 12న (బుధవారం) తమ ఎదుట హాజరుకవాలని సమన్లు జారీచేసినప్పటికీ ఎడియూరప్ప గైర్హాజరు కావడంతో ఆయనపై అరెస్టు వారెంట్ జారీచేయాలని కోరుతూ సిఐడికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఫస్ట్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గురువారం కోర్టు ఎడియూరప్పపై నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీచేసింది. తన 17 ఏళ్ల మైనర్ కుమార్తెపై ఈ ఏడాది ఫిబ్రవరి 2న బెంగళూరులోని డాలర్ల కాలనీ నివాసంలో ఎడియూరప్ప లైంగిక దాడి జరిపినట్లు ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసును నమోదు చేయగా కర్నాటక డిజిపి ఆదేశం మేరకు ఈ కేసును సిఐబికి బదిలీ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖడించిన ఎడియూరప్ప ఈ కేసును తాను న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. ముందస్తు జామీనుతోపాటు ఎప్ఐఆర్‌ని కొట్టివేయాలని



కోరుతూ ఆయన హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఎడియూరప్పపై ఆరోపణలు చేసిన ఆ 53 సంవత్సరాల మహిళ గత నెలలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. కాగా..మార్చి 14న కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఈ కేసులో ఎటువంటి పురోగతి లేదని ఆరోపిస్తూ బాధితురాలి సోదరుడు గత ఆరం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



# తెలంగాణలో భారీగా కలెక్టర్ల బదిలీలు

**హైదరాబాద్:** తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ జరిగింది. 20 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిరోజులకు తాత్కాలిక బదిలీలు జరిపింది. గత ప్రభుత్వ హయాంలో పలు స్థానాల్లో ఉన్నవారిని మార్చింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో బదిలీలు నిలిచిపోయాయి. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం పాలనాపరమైన ప్రక్షాళనలో భాగంగా పెద్దఎత్తున మార్పులు చేసింది. వివిధ జిల్లాల కలెక్టర్లను బదిలీ చేస్తూ కొత్తవారిని నియమిస్తూ ఆదేశాలు ఇచ్చింది.
బదిలీ అయిన కలెక్టర్ల వివరాలు ఇలావున్నాయి. ఖమ్మం: ముజామిల్ ఖాన్, నాగర్‌కర్నూల్: సంతోష్, భూపాలపల్లి: రాహుల్‌శర్మ, కరీంనగర్: అనురాగ్ జయంతి, పెద్దపల్లి: కోయ శ్రీహర్ష, జగిత్యాల: సత్యప్రసాద్, మంచిర్యాల: కుమార్ దీపక్, మహబూబ్‌నగర్: విజయేంద్ర, హనుమకొండ: ప్రావీణ్య, నారాయణపేట్: సిక్తా పట్నాయక్, సిరిసిల్ల: సందీప్‌కుమార్ ఝా, భద్రాద్రి కొత్తగూడెం: జితేష్ వి పాటిల్, వికారాబాద్: ప్రతీక్ జైన్, కామారెడ్డి: ఆశిష్ సంగ్వాన్, నల్గొండ: నారాయణరెడ్డి, వనపర్తి: ఆదర్శ్ సురభి, సూర్యాపేట కలెక్టర్: తేజస్ నందలాల్ పవార్, వరంగల్: సత్య శారదాదేవి, ములుగు: దివాకరా, నిర్మల్: అభిలాష అభినవ్ ఉన్నారు.
ఈ బదిలీల్లో పలువురు కలెక్టర్లను మార్చారు. సుమారుగా 20 జిల్లాలకు కలెక్టర్లను బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా, ట్రాన్స్‌కో జేఎండీ సందీప్ కుమార్ ఝాను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా, అనురాగ్ జయంతిని కరీంనగర్ జిల్లా కలెక్టర్గా, నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కామారెడ్డిజిల్లా కలెక్టర్‌గా, జితేష్ వి పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా, రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా, పీ ప్రావీణ్యను వరంగల్ జిల్లా కలెక్టర్ నుంచి హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా, సత్యప్రసాద్‌ను ఖమ్మం అదనపు కలెక్టర్ నుంచి జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేశారు. కోయ శ్రీహర్షను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా, విజయేంద్ర బోయిని మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా, కుమార్ దీపక్‌ను మంచిర్యాల కలెక్టర్‌గా, ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ కలెక్టర్‌గా, నారాయణరెడ్డి వికారాబాద్ కలెక్టర్‌గా, ఆదర్శ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా, తేజస్ నందలాల్‌ను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా, సత్య శారదాదేవిని వరంగల్ జిల్లా కలెక్టర్‌గా, దివాకర్‌ను ములుగు జిల్లా కలెక్టర్‌గా, అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# చట్టబద్ధంగానే విద్యుత్ కొనుగోళ్లు



**హైదరాబాద్:** విద్యుత్ కొనుగోలు, పవర్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో అన్ని రకాల చట్టాలు, నిబంధనలు పాటిస్తూ ముందుకెళ్లామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర అనుమతులు సాధిస్తూ ముందుకెళ్లామని చెప్పారు. ఈఆర్సీ సంస్థలు వెలువరించిన తీర్పులపై కమిషన్లు వేయకూడదన్న విషయం కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. కమిషన్ చట్టవిరుద్ధమని ప్రభుత్వానికి సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విరుద్ధమని చెప్పారు. రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ కొనుగోలు విషయంలో జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ వివరణ ఇచ్చారు. ఈమేరకు కమిషన్‌కు 12 పేజీల లేఖ రాశారు.
'రాష్ట్రం ఏర్పడినప్పుడు విద్యుత్ రంగం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కరెంటు సరిగా లేక లక్షలాదిగా వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయిన పరిస్థితి. పారిశ్రామిక రంగంలో ప్రతి వారంలో కొన్ని రోజులు పవర్ హాలిడే ప్రకటించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఏమాత్రం సరిపోదు. తెలంగాణ విద్యుత్ పంపిణీ వ్యవస్థ పటిష్ఠానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకున్నాం. అన్ని రకాల అనుమతులు పొంది మందుకు పురోగమించడం జరిగింది. రాజకీయ కక్షతో తనను, అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికే కమిషన్ వేశారు. మా ప్రభుత్వం గణనీయ మార్పుతో కరెంటు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. మా మార్పును తక్కువ చూపించేందుకే ప్రభుత్వ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. పత్రికా విలేకఖరుల సమావేశంలో కమిషన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడింది. విచారణ అనేది ఒక పవిత్రమైన బాధ్యత. ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిగా నిలిచి నిజాలు నిగ్గుతేల్చాలి. అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు వెల్లడించాలి. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వాలని మాట్లాడుతున్నట్లుంది. ఇప్పటికే నష్టం జరిగినట్లు.. ఆర్థిక నష్టాన్ని లెక్కిస్తున్నట్లు మీ మాటలు ఉన్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించట్లేదు. నేను మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదు. మేం చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని వైదొలిగితే మంచిది. మీరు కమిషన్ బాధ్యల నుంచి వైదొలగాలని వినయ పూర్వకంగా కోరుతున్నా' అంటూ కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. పరిస్థితులను గమనించే నాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విద్యుత్తు అవసరాల దృష్ట్యా విభజన చట్ట ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఎంతమాత్రం సరిపోదు. 2014 నాటి వినియోగాన్ని బట్టి దాదాపు 2,700 మెగావాట్ల కొరత ఉంది.నాటి ఆంధ్రప్రదేశ్ కరెంట్ సరఫరాను ఎగవేయడం వల్ల 1,500 మెగావాట్లు, గ్యాస్ ఆధారిత విద్యుత్తు రాకపోవడం వల్ల 900 మెగావాట్లు కలిపి మరో 2,400 మెగావాట్ల లోటు ఏర్పడింది. మొత్తమ్మీద సుమారు 5,000 మెగావాట్ల కొరతతో తెలంగాణలోని విద్యుత్తు రంగంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. విద్యుత్తు సంక్షోభం నుంచి గట్టెక్కడానికి శాశ్వత ప్రయోజనాలు కోసం విద్యుత్తు పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాం. ఫలితంగానే రాష్ట్రం ఆవిర్భవించినప్పుడు 7,778 మెగావాట్లుగా ఉన్న రాష్ట్ర స్థాపిత విద్యుత్తు, తర్వాత సుమారు 20,000 మెగావాట్లపైచిలుకుకు చేరింది. దేశంలోనే నాణ్యమైన నిరంతరాయ కరెంటు అన్ని రంగాలకూ సరఫరా చేసిన ఏకైక రాష్ట్రంగా మారింది. 2014 నాటికి తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం 1,196 యూనిట్లు ఉండగా, పదళ్లలో అది 2,349 యూనిట్లకు పెరిగింది. ఈ విజయాలు ఆషామాషీగా సాధించలేదు. విద్యుత్తు కొనుగోళ్ల విధానంలో, నూతన విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటులో చట్టాలను, నిబంధనలను పాటించాం. ఎలక్ట్రిసిటీ యాక్ట్ 2003ను అనుసరిస్తూ అవసరమైన అన్ని రకాల అనుమతులను పొంది ఎస్.ఇ.ఆర్.సి తీర్పులకు లోబడే చర్యలూ తీసుకున్నాం. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఇ.ఆర్.సిలో ఫిర్యాదు చేయవచ్చు. దీనిపై తీర్పు నచ్చకుంటే అప్పిలేట్ ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చు. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్ర విద్యుత్తు సంస్థలు కరెంటు కొనుగోలు చేయడంపై నాటి తెలుగుదేశం ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి తెలంగాణ ఇ.ఆర్.సికి
అభ్యంతరాలు చెప్పారు. వాటిని పరిశీలించిన తర్వాతే తెలంగాణ విద్యుత్తు సంస్థలు చేసిన ప్రతిపాదనలకు ఇ.ఆర్.సి. ఆమోదముద్ర వేసింది. అప్పుడు అభ్యంతరం ఉండి ఉంటే అప్పిలేట్ ట్రిబ్యునల్ కు లేదా ఇతర కోర్టులకు వెళ్లే స్వేచ్ఛ ఉంది. కానీ ఆయన ఆనాడు ఎలాంటి అప్పీలుకూ వెళ్లిన దాఖలాలు చేయలేదు.
రేవంత్రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యుత్తు విజయాలను సాధించిన గత ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ శ్వేతపత్రాలు విడుదల చేశారు. వాటిపై చర్చలు జరిగాయి. రెగ్యులేటరీ సంస్థల తీర్పులపై విచారణ చేయొద్దన్న ఇంగితం లేకండా కమిషన్ ఏర్పాటు చేశారు.

# పుంగనూరులో టిడిపి ఆందోళన

## పర్యటన రద్దు చేసుకున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి

**చిత్తూరు:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కీలక పాత్ర నిర్వహించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన తొలిసారి నియోజకవర్గంలో పర్యటించాలని అనుకున్నారు. ఈ మేరకు అనుచరులు ఏర్పాట్లు చేశారు. శనివారం ఆయన పుంగనూరు రావాల్సి ఉంది. కానీ నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో ఆయన పర్యటనను రద్దు చేసుకున్నారు. పుంగనూరులో పెద్దిరెడ్డి పర్యటనను నిరసిస్తూ టీడీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయనకు పదవిలో ఉండే అర్హత లేదని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కూడలి నుంచి ఇందిర కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్యలో ఓ వైసీపీ నాయకుడి ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. తమ ఇంటిపై దాడి చేశారని వైసీపీ నేత ఆరోపిస్తూ ఆస్పత్రిలో చేరారు. ఇలాంటి సమయంలో పెద్దిరెడ్డి నియోజకవర్గానికి వస్తే ఇంకా ఎక్కువ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడతాయన్న ఉద్దేశంతో ఆయన ఆగిపోయినట్లుగా తెలుస్తోంది. నిజానికి పుంగనూరు నియోజకవర్గాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దుర్భేధ్యంగా మార్చుకున్నారు. ఆయనను కాదని ఎవరూ చిన్న ర్యాలీ కూడా నిర్వహించలేరు. అలా చేస్తే దాడులు జరుగుతాయి. టీడీపీ వాళ్లు అయినా.. బోడె రామచంద్రయాదవ్ కు చెందిన వారు ఎవరైనా సరే .. నియోజకవర్గంలో ఎక్కడా ర్యాలీలు నిర్వహించే పరిస్థితి కూడా ఉండదు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు టీడీపీ కార్యకర్తలు సైకిల్ పై కుప్పం వెళ్తూంటే.. పుంగనూరులో వాళ్లతో చొక్కాలు విప్పదీయించి.. పంపించారు మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు. అలాంటి ఎంతో మందిపై దాడులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. అలాంటి చోట పెద్దిరామచంద్రారెడ్డి అధికారం కోల్పోవడంతో ఆయన కూడా పర్యటించలేని పరిస్థితికి వచ్చింది. గతంలో చంద్రబాబు చిత్తూరు పర్యటనకు వెళ్లినప్పుడు మదనపల్లె నియోజకవర్గ పరిధిలోని అంగళ్లు నియోజకవర్గంలో రాళ్ల దాడి జరిగింది.
అక్కడి నుంచి పుంగనూరుకు వస్తున్న సమయంలో నగరంలోకి ఎంటర్ కాక ముందే ఆయనపై పెద్ద ఎత్తున దాడికి ప్రయత్నించారు. పోలీసులు కూడా పట్టించుకోక పోవడంతో టీడీపీ కార్యకర్తలు తిరగబడ్డారు. పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకున్నారు. పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. ఆ ఘటన తర్వాత వందల మంది టీడీపీ కార్యకర్తల్ని అరెస్టు చేశారు. ఆ కోపం అంతా ఉంటుందని... నియోజకవర్గానికి రాకపోతేనే మంచిదని ఆయనకు పార్టీ నేతలు సూచించినట్లుగా తెలుస్తోంది.

# ప్రియుడి మోజులో భర్త హత్య

### సుపారీ ఇచ్చి హత్య చేయించిన భార్య

### ఆదిలాబాద్ టీచర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

**ఆదిలాబాద్:** జిల్లాలో ప్రభుత్వ టీచర్ హత్య కేసులో సంచలన విషయాలు బయట కొచ్చాయి. ప్రియుడి మోజులో పడిన భార్యనే సుఫారీ ఇచ్చి భర్తను దారుణంగా హత్య చేయించినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. భార్య కదలికలపై అనుమానం వచ్చి ఆమె సెల్‌ఫోన్‌ను చెక్ చేయగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. భర్త స్కూలుకు వెళ్లగానే ప్రియుడిని ఇంటికి పిలిపించుకుని ఎంజాయ్ చేయడం, వాటిని ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నట్లుగా కూడా గుర్తించారు. ఇప్పుడు ఆ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా కూడా మారాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం నాగులకొండకు చెందిన గజేందర్.. జైనథ్ మండలం కెనాల్ మేడిగూడలో గవర్నమెంట్ టీచర్‌గా పని చేస్తున్నాడు. భార్య విజయలక్ష్మితో కలిసి సంతోషంగా జీవిస్తున్నాడు. అయితే మహేశ్ అనే యువకుడితో విజయలక్ష్మి అక్రమ సంబంధం పెట్టుకుంది. భర్త ఉద్యోగానికి వెళ్లిపోగానే ప్రియుడితో కలిసి షికార్లు చేసేది. అతనితో ఎంజాయ్ చేస్తూ.. వాటిని ఫొటోలు తీసి మధుర జ్ఞాపకాలుగా ఫోన్‌లోనే దాచి పెట్టుకుంది. అయితే కొద్దిరోజులుగా వేసవి సెలవులు ఉండటంతో వాళ్లిద్దరూ కలుసుకోవడానికి కుదరలేదు. దీంతో భర్త ఉంటే ఎప్పటికైనా తమకు అడ్డే అని భావించిన విజయలక్ష్మి అతన్ని హత్య చేయాలని భావించింది. ప్రియుడితో కలిసి భర్త మర్డర్‌కు స్కెచ్ వేసింది. ఒక సుపారీ గ్యాంగ్‌ను కూడా సంప్రదించి.. తన భర్త గురించి పూర్తి వివరాలను వెల్లడించింది. స్కూల్ రీఓపెన్ రోజున ప్లాన్ చేసి గజేందర్‌ను చంపేశారు. ఆ తర్వాత ఏం తెలియనట్టుగా విజయలక్ష్మి తన భర్త కనిపించడం లేదని గజేందర్ భార్య విజయలక్ష్మి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# మోడీ ప్రచారం చేసిన చోటల్లా విజయం

**ముంబై:** మహారాష్ట్రలో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష 'మహా వికాస్ అఘాడి' కి మద్దతు తెలిపిన ప్రజలందరికీ కూటమి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఎంవీఏ నేతలు శరద్ పవార్, ఉద్ధవ్ థాకరే, పృథ్వీరాజ్ కపూర్ సంయుక్తంగా శనివారంనాడు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎక్కడైతే రోడ్‌షోలు, ర్యాలీలు నిర్వహించారో అక్కడ తాము గెలిచామని ఈ సందర్భంగా శరద్ పవార్ అన్నారు. ఎంవీఏకు అనుకూలంగా రాజకీయ వాతావరణాన్ని మోదీ సృష్టించారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో
భారతీయ జనతా పార్టీకి, ఎన్డీయేకు గట్టి దెబ్బ తగిలిన మూడు రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. 2022 జూన్‌లో శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీల్లో చీలికలు ఏర్పడి, చీలిక గ్రూపులు బీజేపీతో చేతులు కలిపి అధికారంలోకి వచ్చిన అనంతరం మహారాష్ట్రలో జరిగిన తొలి ఎన్నికలు ఇవే కావడం విశేషం. ఈ ఎన్నికల్లో బీజేపీ కేవలం 9 సీట్లు గెలుచుకుంది. 2019లో బీజేపీ 23 సీట్లతో విజయకేతనం ఎగురవేసింది. ఎన్నికల కమిషన్ డాటా ప్రకారం, మోదీ ప్రచారం చేసిన మెజారిటీ సీట్లలో ఎన్డీయే ఈసారి విజయం సాధించడంలో విఫలమైంది. మహారాష్ట్రలోని 18కి పైగా లోక్‌సభ స్థానాల్లో మోదీ ప్రచారం చేశారు. వాటిలో 15 సీట్లలో ఎన్డీయే ఓటమి చవిచూసింది. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ 'మహా వికాస్ అఘాడి' కలిసే పనిచేస్తుందని శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ థాకరే శనివారంనాడు జరిగిన మీడియా
సంయుక్త సమావేశం లో తెలిపారు. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో బాసటగా నిలిచిన సిటిజన్ గ్రూపులు, వివిధ యూట్యూబ్ ఛానెళ్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనను వదిలి వెళ్లిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకునేది లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ మాట్లాడుతూ, తమ కూటమిలో ఎక్కువ-తక్కువలు లేవని, ప్రతి అసెంబ్లీ సీటును పరిగణనలోకి తీసుకుని సీట్ల షేరింగ్‌పై నిర్ణయాలు తీసుకుంటామని, ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిపామని చెప్పారు.

# ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టి ఆరు స్కామ్‌లు

**హైదరాబాద్:**కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ఆరు నెలల్లో ఆరు స్కాంలకు పాల్పడిందని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు. బియ్యం స్కాం, లిక్కర్ స్కాం, ÷÷-ల యాష్ స్కాంలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసిందని విమర్శించారు. జనవరి 11న ఆర్టీసీ డిజిటల్ టిక్కెట్ల కోసం ఇచ్చిన టెండర్‌ను రద్దు చేసి.. ఆఫ్‌లైన్ టెండర్‌ను తీసుకువచ్చారని మన్నె క్రిశాంక్ అన్నారు. ఎన్ని సంస్థలు వచ్చాయి, ఎంత అమౌంట్‌కు కోట్ చేశారో చెప్పలేదని తెలిపారు. గుట్టుచప్పుడు కాకుండా ఛలో మొబిలిటీ అనే సంస్థకు టెండర్‌ను కట్టబెట్టారని విమర్శించారు. ఆర్టీసీ టిక్కెట్ కమీషన్ నేరుగా ఆ కంపెనీ ఖాతాలోకి వెళ్తుందని అన్నారు. కాంట్రాక్టు గురించి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎందుకు గోప్యత పాటించారని ప్రశ్నించారు.రాష్ట్రవ్యాప్తంగా 13,200 మిషిన్స్ కొనుగోలు చేశారు.. ప్రతి టిక్కెట్ కమిషన్ కంపెనీకి వెళ్తుందని క్రిశాంక్ ఆరోపించారు. ఈ కమీషన్‌లో పొన్నం ప్రభాకర్ వాటా ఎంత అని నిలదీశారు. ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసుల ప్రభుత్వంగా మారిందని మండిపడ్డారు.

# ఉత్తరాఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం

### లోయలోపడ్డ టెంపో..8మంది మృత్యువాత

**నైనిటాల్:**ఉత్తరాఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రుద్రప్రయోగ్ లోని బ్రదీనాథ్ హైవే సమీపంలో అదుపుతప్పి టెంపో వాహనం లోతైన లోయలో పడింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. మరి కొందరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో టెంపోలో 17 మంది ప్రయాణిస్తున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన ఔఆఖీఈ, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. లోయలో నుంచి ఇద్దరిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ వీరిని హాస్పిటల్ కు తరలించారు. మరోవైపు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్స సింగ్ ధామి స్పందించారు. ఔఆఖీఈ, పోలీసులు సహాయక చర్యలు చేస్తున్నారని ట్వీట్ చేశారు. ప్రమాదంపై విచారణ చేయాలని జిల్లా మేజిస్ట్రేట్ ను ఆదేశించారు.

# పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు

### ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశం

**అమరావతి:** ఏడాదిలోగా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా చేపట్టాల్సిన పనులతో పాటు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఫేజ్-2, ఫేజ్-3 పనులన్నీ ఏడాదిలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంపై అధికారులను ఆరా తీశారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి దిల్లీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఇతర రాష్ట్రాల్లో స్కూల్స్ శానిటేషన్‌ను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు మారిన విద్యార్థుల సంఖ్య, అందుకుగల కారణాలను విశ్లేషించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జనరల్ డ్రాప్ అవుట్స్ వివరాలు కూడా అందజేయాలన్నారు. ఎన్ని పాఠశాలలు మూతపడ్డాయి, అందుకు గల కారణాలను కూడా తెలియజేయాలన్నారు. దేశంలోనే బెస్ట్ లైబ్రరీ మోడల్ ఎక్కడ ఉందో తెలుసుకుని, సమీక్ష చేసి అందుకు సంబంధించిన నోట్‌ను సిద్ధం చేయాలని తెలిపారు. బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌బీ వినియోగం మీద సమగ్ర నోట్ ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు కిట్‌లు అందజేసే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జులై 15 నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఇవ్వాలని ఆదేశించారు. గత ప్రభుత్వం ఇంటర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఇవ్వకపోవడం పట్ల లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో తెదేపా ప్రభుత్వం కొనుగోలు చేసిన సైకిళ్లను వైకాపా ప్రభుత్వం పంపిణీ చేయకుండా మూలన పడేసిన నేపథ్యంలో వాటి వివరాలు ఇవ్వాలని అధికారులను కోరారు. ఇకపై ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరుగుతాయని మంత్రి స్పష్టం చేశారు.

# ఘనంగా బోనాల జాతర నిర్వహణ

**హైదరాబాద్:**వచ్చే నెల జూలైలో జరగబోయే బోనాల జాతరను ఘనంగా జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతుంది. జూబ్లీహిల్స్ ఎంసీహెచ్ఆర్ డిలో బోనాల పండుగ ఏర్పాట్లపై రివ్యూ మీటింగ్ జరిగింది. ఆషాఢ మాసం బోనాలు పండుగ ఘనంగా ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలతో మీటింగ్ జరిగింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్
గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్ ,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఆషాఢ మాసం బోనాల జాతర ను విజయవంతం చేసుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు , శాంతి భద్రతలు ,దేవాలయాల వద్ద భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాల పై సమీక్షా సమావేశంలో చర్చించారు.

# తుమ్మడిహెట్టి ప్రతిపాదన పక్కన పడేశారు

**హైదరాబాద్:** మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించాలన్నది కేసీఆర్ ప్లానేనని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ కాళేశ్వరం కమిటీకి రిపోర్ట్ ఇచ్చింది. ఈ నివేదికలో కీలక అంశాలను ప్రస్తావించింది. తుమ్మిడిహెట్టి వద్ద తాము ప్రపోజ్ చేసినా వద్దని పక్కన పడేశారని తెలిపింది. రిపోర్ట్‌ను అప్పటి ఇరిగేషన్ మినిస్టర్, సీఎం కేసీఆర్‌కు అందించినా సంతకం చేయలేదని ఇంజినీర్లు తెలిపారు. ఈ మేరకు అప్పుడు ప్రపోజ్ చేసిన నివేదికను రిటైర్డ్ ఇంజినీర్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిటీకి అందజేశారు. అనంతరం పీసీ ఘోష్ మీడియాతో చిట్ చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం సబ్ కాంట్రాక్టర్లను గుర్తించే పనిలో ఉన్నామని తెలిపారు. ఆ సంస్థలకు సంబంధించిన డేటాను రిజిస్ట్రార్ ఆఫ్? కంపెనీస్ నుంచి తీసుకుంటామని చెప్పారు. ఆయా కంపెనీల ఖాతాలు, బ్యాంక్ స్టేట్మెంట్స్ పరిశీలిస్తే ఎంత మొత్తం చేతులు మారిందనేది తెలుస్తుందని చెప్పారు. అసిస్టెంట్ డిప్యూటీ ఇంజనీర్లను పిలువాలా.. వద్దా.. అనే అంశంపై కసరత్తు చేస్తున్నట్టు చెప్పారు. విచారణకు పిలిస్తే ఎవరైనా రావాల్సిందేనని పీసీ ఘోష్ అన్నారు. రాకుంటే ఏం చేయాలో తమకు తెలుసునని చెప్పారు. ఈ విషయంలో తనకు అధికారాలున్నాయని అన్నారు. అన్ని అఫిడవిట్లను పరిశీలించిన తర్వాతే సెంట్రల్ వాటర్ కమిషన్ వాళ్లను పిలుస్తామని చెప్పారు. ఏఈఈ, డీఈఈలను విచారించాలా..? వద్దా..? అన్నది తర్వాత ఆలోచిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి ఇంజినీర్లతో విచారణ పూర్తయిందన్నారు. వాళ్ల నుంచి అఫిడవిట్లు వచ్చాక ముందుకు వెళ్తామని అన్నారు. మొత్తం 10 నుంచి 15 సబ్ కాంట్రాక్టులు ఇచ్చారు. వాటి వివరాలను సేకరించే పనిలో కమిషన్ నిమగ్నమైంది.

# బీహార్ ప్రయోజనాలు తాకట్టు నితీశ్‌పై ప్రశాంత్ కిశోర్ విమర్శలు



**పట్నా:** బీహార్ ప్రయోజనాలను బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పణంగా పెట్టారని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆయనతో కలిసి పనిచేసిన నేను ఎందుకు విమర్శిస్తున్నానని ప్రజలు నన్ను అడుగుతున్నారు. అప్పుడు సీఎం వేరే వ్యక్తి. కాని ఇప్పుడు మనస్సాక్షిని భాజపాకు అమ్మకానికి పెట్టారు. ఒక రాష్ట్రానికి నాయకుడిగా ఉండేవాడు అక్కడి ప్రజలు గర్వపడేలా నడుచుకోవాలి. కానీ నీతీశ్ కుమార్ బిహార్‌కు అవమానాన్ని మిగిల్చారు' అని కిశోర్ ఆరోపించారు. మోదీ అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన నీతీశ్ కుమార్ రాష్ట్ర ప్రయోజనాల కోసం తన పలుకుబడిని ఉపయోగించట్లేదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా మెజారిటీ మార్కును దాటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కౌంటింగ్‌కు ముందు ప్రశాంత్ కిశోర్ జోస్యం చెప్పారు. అయితే, ఆ పార్టీకి మెజారిటీ మార్కు కంటే సీట్లు తగ్గాయి. ఎగ్జిట్ పోల్స్ తప్పని నిరూపిస్తూ ఇండియా కూటమి 234 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. అయితే భాజపా సారథ్యంలోని ఎన్డీయేకు మెజార్టీ రావడంతో ప్రధాని మోదీ తిరిగి బాధ్యతలు చేపట్టారు.

# తెలుగు ఐఏఎస్ కృష్ణతేజకు జాతీయ పురస్కారం

### అభినందించిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి:** తెలుగు ఐఏఎస్ కృష్ణతేజకు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. జాతీయ బాలల రక్షణ కమిషన్ పురస్కారానికి ఆయన ఎంపిక కావడం హర్షణీయమని తెలిపారు. మరిన్ని సేవలందిస్తూ ఉద్యోగులు, యువతకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కృష్ణతేజ త్రిస్సూర్ కలెక్టర్‌గా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ఆయన ఉత్తమ విధానాలు అనుసరించారని గుర్తుచేశారు. కరోనా, కేరళ వరదల విపత్తుల సమయంలో ఆయన అందించిన సేవలను ప్రజలు మరచిపోలేదని పవన్ తెలిపారు.
తెలుగుతేజం, ఐఏఎస్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణతేజకు జాతీయ పురస్కారం లభించింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఆయన కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నారు. బాలల హక్కుల రక్షణలో దేశంలోనే త్రిసూర్ జిల్లాను అగ్రగామిగా నిలపడంతో జాతీయ బాలల హక్కుల కమిషన్ పురస్కారానికి ఎంపికయ్యారు. 27న దిల్లీలో ఈ అవార్డును అందుకోనున్నారు.

# కామారెడ్డి కలెక్టర్ గా ఆశిష్ సంగ్వాన్ .



## - జితేష్ వి పాటిల్ భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జూన్ 15:** కామారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ గా 2016 బ్యాచ్ కు చెందిన ఆశిష్ సంగ్వాన్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న జితేష్ వి పాటిల్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా బదిలీ చేశారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్ పనిచేస్తున్న సంగ్వాన్ స్వస్థలం హర్యానా రాష్ట్రంలోని భివాని. అమెరికా లోని జార్జియా టెక్ యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్ డిగ్రీ చేసిన అనంతరం 2015 లో జరిగిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో 12 వ రాంక్ సాధించారు. అక్టోబర్ 2023 నుండి నిర్మల్ కలెక్టర్ గా పనిచేస్తున్న సంగ్వాన్ ను కామారెడ్డి జిల్లా కలెక్టర్ గా నియమించారు. వీరి భార్య కూడా 2016 బ్యాచ్ కు చెందిన ఐ.ఏ.ఎస్. అధికారి క్రాంతి వల్లూరు. ప్రస్తుతం వీరు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్నారు. వీరికి ఒక పాప కలదు.

# పోలీస్ అకాడమిలో అరుదైన దృశ్యం

## ఐఎఎస్‌గా వచ్చిన కూతురికి తండ్రి సెల్యూట్



హైదరాబాద్: ఐఏఎస్ అధికారిణిగా పోలీస్ అకాడమికి వచ్చిన కుమార్తెకు ఆ పోలీస్ అకాడమిలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఐపీఎస్ తండ్రి సెల్యూట్ చేశాడు. హైదరాబాద్ చిల్కూరు ఏరియాలోగల 'రాజ్‌బహదూర్ వేంకట రంగారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమి లో శనివారం మధ్యాహ్నం ఈ అత్యంత అరుదైన ఘటన జరిగింది. శనివారం ఏడుగురు ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు ప్రాక్టికల్ ట్రెయినింగ్ కోసం అకాడమికి వచ్చారు.


# మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా పోటీలకు "సత్యశోధక్" జట్టు

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జూన్ 15:**



ఈ నెల 19 నుంచి 23 వరకు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా-2024 కప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు ఎంపిక అయింది. గత ఏప్రిల్ మాసంలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన రీజినల్ ఉభయ రాష్ట్రాల మేజర్ లీగ్ బేస్ బాల్ (ఎం. యల్. బి ) అండర్ 12 ఛాంపియన్ పోటీలలో సత్యశోధక్ పాఠశాలకు జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకోవడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. జాతీయ స్థాయి కి ఎంపికైన పాఠశాల జట్టు విద్యార్థులను శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయి పోటీలకు పాఠశాల జట్టు ఎంపికకావడం అభినందనీయమని, మంచి ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలుచుటకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, పిఈటీ లు అనిల్, సంతోష్ లు పాల్గొన్నారు.

# ప్రక్షాళనకు ప్రభుత్వం నిర్ణయం!



**అమరావతి:** తనకు, ప్రజలకు మధ్య ఎలాంటి అడ్డుగోడలు ఉండటానికి వీల్లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వారి సమస్యల వినతుల స్వీకరణకు ప్రత్యేక ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఏ పద్ధతుల్లో ఏర్పాటు చేయాలో అభిప్రాయాలు తీసుకుని ఉత్తమ విధానం అమలు చేస్తామని అన్నారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి చంద్రబాబు వచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఏపీ సచివాలయంలోనే వినతులు స్వీకరిస్తే ఎలా ఉంటుందనే విషయంపై ఆలోచిస్తున్నా మని తెలిపారు. ప్రజావినతులు స్వీకరణకు వీలైనంత ఎక్కువ సమయం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. వాటి పరిష్కారానికి నిర్దిష్ట సమయం ఉండేలా చర్యలు తీసుకుంటానని మాటిచ్చారు. సచివాలయానికి రాకపోకల కోసం రవాణా, ఇతరత్రా వెసులుబాటులన్నీ అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు.

## అటవీ దొంగలు ఎంతటి వారైనా

# ఉపేక్షించం



అడవులను, పర్యావరణాన్ని కాపాడుతాం

ఎర్రచందనం దొంగలను అరికడతాం

ఎంతటి వారైనా కటకటాల్లోకి తోసేస్తాం

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి:** ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. అడవుల వినాశనానికి పాల్పడినా, ప్రయత్నించినా ఎంతటి వారైనా సరే కటకటాల వెనక్కు వెళ్లాల్సిందేనని మాస్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు మేలైన సేవలు అందించే భాగ్యం కలిగిందని అన్నారు. ప్రజల సమస్యలు స్వయంగా చూశానని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగు నీరు అందించడంపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తాను నిర్వర్తించబోయే శాఖలు తన మనసుకు, జనసేన మూల సిద్దాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయని తెలిపారు. శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి, ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చేవిగా తాను భావిస్తున్నానని అన్నారు. శనివారం సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... 2014 నుంచి తాను రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పర్యటనల సందర్భంగా అనేక కష్టాలు కన్నీళ్లు చూశానని చెప్పారు. ఆడపడుచులు గుక్కెడు నీళ్ల కోసం పడుతున్న అవస్థలు తనకు ఆవేదన కలిగించాయన్నారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.

జల్ జీవన్ మిషన్ ద్వారా ప్లలెలకు రక్షిత తాగునీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' అనేది జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటి అని చెప్పారు.

# సిక్కింలో భారీ వర్షం..

## వరదల్లో చిక్కుకుపోయిన 1200 మంది టూరిస్టులు

**సిక్కిం:** సిక్కింలో భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ప్రకృతి అందాలను చూసేందుకు వెళ్లిన పర్యాటకులు వరదల్లో చిక్కుకుపోయారు. నార్త్ సిక్కింలో 22 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తీస్తాలో వరదలు సంభవించడంతో.. 1200 మంది స్వదేశీ, విదేశీ పర్యాటకులు లాచుంగ్ ప్రాంతంలో చిక్కుకుపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టి.. వాతావరణం అనుకూలించాక పర్యాటకులను తరలించే ఏర్పాట్లు చేస్తామని స్థానిక అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడటంతో.. ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరి నీటమునిగాయి. ఇక భారీ వర్షాలు, వరదలు కొట్టుకుపోయిన, డ్యామేజ్ అయిన రోడ్ల మరమ్మతులకు కనీసం 5-6 రోజుల సమయం పడుతుందన్నారు. ఇప్పటి వరకూ సిక్కింలో వర్షాల కారణంగా ఆరుగురు మరణించారని, వారిలో ముగ్గురి మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సంక్లాంగ్ లోని వంతెన వరదనీటిలో కొట్టుకుపోవడంతో.. చుంగ్తాంగ్, లాచుంగ్ ప్రాంతాల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో చిక్కుకున్న పర్యాటకులను ప్రత్యేక విమానంలో తరలించేందుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లను వీలైనంత త్వరగా మరమ్మతు చేయాలని ఆదేశించారు.

## నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు

# పాటించాల్సిందే



నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు

రాష్ట్ర వ్యాప్తంగా బృందాలు నిరంతరం ఆహార తనిఖీ

మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా ఆహార పదార్థాల టెస్టులు

తయారుదారులు లైసెన్స్ రిజిష్ట్రేషన్ తప్పనిసరి

ఫుడ్ సేఫ్టీలో తెలంగాణ ఆదర్శంగా నిలవాలి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఫుడ్ సేఫ్టీపై ఉన్నత స్థాయి సమీక్ష

**హైదరాబాద్:** ఫుడ్ సేఫ్టీపై ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ పై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా సుమారు 180 నుంచి 200 ఫుడ్ శాంపిల్స్ లను టెస్టులు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ హాస్టల్స్, ప్రైవేటు బోర్డింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లు, బేకరీలు, డెయిరీ ఫుడ్ తయారీదారులు, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ తయారుదారులు లైసెన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ %-% 2006 ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించని ఫుడ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టాస్క్ ఫోర్స్ , ఫుడ్ సేఫ్టీ అన్ వీల్స్ (ఫుడ్ లాబ్స్), ఆకస్మిక తనిఖీలు, అవగాహన సదస్సులను నిరంతరం నిర్వహించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరు పై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.కాగా.. మనం తీసుకునే ఆహారం నాణ్యత లోపం ఉంటే అనారోగ్య సమస్యలు మన దరికి చేరుతాయి. ఇటీవల కాలంలో ఎక్కువగా భోజనప్రియులు బయటి హోటల్, రెస్టారెంట్లలో భుజించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నటువంటి పరిస్థితి. అయితే భోజనం ప్రియుల ఆదరణకు నోచుకుంటున్న పలు హోటల్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ శభాష్ అనిపించుకుంటూ ఉండగా, మరికొన్ని హోటల్, రెస్టారెంట్ల యాజమాన్యాలు మాత్రం ఫ్రిజ్ లలో ఆహార పదార్థాలను నిల్వ ఉంచుతూ భోజన ప్రియులకు అందిస్తున్న తీరును అరికట్టేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.




# పవన్ కళ్యాణ్.. నిర్మాతలకు ఇది టెన్షనే..



ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాలలో యాక్టివ్ గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో పాటు పవన్ కళ్యాణ్ మరో ఐదు మంత్రిత్వ శాఖలు కూడా తీసుకున్నారు. ఈ శాఖలన్నింటికి సంబందించిన పనులని పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా దగ్గరుండి చూసుకోవాలి.ప్రస్తుతం పవన్ కళ్యాణ్ చేతిలో పంచాయితీ రాజ్, రూరల్ డెవలప్మెంట్, రూరల్ వాటర్ సప్లై, ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు ఉన్నాయి. ఇవన్నీ కూడా చాలా ముఖ్యమైన పోర్ట్ ఫోలియోలు అని చెప్పాలి. పంచాయితీరాజ్, రూరల్ డెవలప్మెంట్ శాఖలు పవన్ కళ్యాణ్ ఏరికోరి తీసుకున్నారు. వాటి నిర్వహణ అనేది చాలా క్లిష్టతరమైనది అని చెప్పాలి.అలాంటి శాఖలని పవన్ కళ్యాణ్ తీసుకోవడం వెనుక రూరల్ డెవలప్మెంట్ మీద ప్రత్యేక దృష్టి సారించడానికేననే మాట వినిపిస్తోంది. కచ్చితంగా పవన్ కళ్యాణ్ ఈ శాఖలని సమర్ధవంతంగా నిర్వహిస్తారని చాలా మంది నమ్ముతున్నారు. అయితే ఇన్ని బాధ్యతల మధ్యలో పవన్ కళ్యాణ్ కి ఊపిరి తీసుకోలేనంత వర్క్ ఉంటుంది. కానీ పవన్ కళ్యాణ్ ఒప్పుకున్న మూడు సినిమాలు ఇప్పుడు పూర్తి చేయాల్సి ఉంది.ఓజీ, హరిహర వీరమల్లు సినిమాలు షూటింగ్ చివరి దశలో ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ కూడా 30% కంప్లీట్ అయ్యిందంట. ఇవి సకాలంలో పూర్తిచేయకపోతే నిర్మాతలు భారీగా నష్టపోతారు.



# బన్నీ అన్ ఫాలో విషయం.. నిహారిక అలా అనిందేంటి?


జనసేనాని పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేసి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. పదేళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఆయన.. తొలిసారి ఎమ్మెల్యేగా గ్రాండ్ విక్టరీ కొట్టారు. రాష్ట్రంలో కూటమి ఏర్పాటు నుంచి విజయం సాధించడం వరకు గేమ్ ఛేంజర్ గా వ్యవహరించిన పవన్.. డిప్యూటీ ముఖ్యమంత్రి పదవిని పొందారు. దాంతోపాటు తనకు ఇప్పటికే ఆసక్తి ఉన్నట్లు చెప్పిన వివిధ శాఖలకు మంత్రిగా ఐదేళ్లపాటు వ్యవహరించనున్నారు.అయితే ఎన్నికల ప్రచారం సమయంలో హీరో అల్లు అర్జున్.. పవర్ స్టార్ కు మద్దతుగా పోస్ట్ పెట్టి వైసీపీ అభ్యర్థి ఇంటికి వెళ్లడం పెద్ద దూమారం రేపింది. నంద్యాలలో వైసీపీ తరఫున పోటీ చేసిన తన స్నేహితుడు శిల్పా రవి ఇంటికి వెళ్లి బన్నీ విషెస్ తెలిపారు. దాన్ని పవన్ ఫ్యాన్స్ తప్పు పట్టారు. సోషల్ మీడియాలో బన్నీ అభిమానులు, పవన్ ఫ్యాన్స్ మధ్య మాటల యుద్ధమే నడించింది. ఇంతలో నాగబాబు చేసిన ఒక్క ట్వీట్ మరింత అగ్గి రాజేసింది.ఇక పవన్ గెలిచాక.. చిరంజీవి ఇంట్లో సెలబ్రేషన్స్ గ్రాండ్ గా జరిగాయి. మెగా ఫ్యామిలీ అంతా అటెండ్ అయినా.. అల్లు కుటుంబం నుంచి ఎవరూ కనిపించలేదు. పవన్ ను కలిసి విషెస్ చెప్పినట్లు కూడా ఎక్కడా వార్తలు లేదు. దీంతో రెండు ఫ్యామిలీల మధ్య గ్యాప్ పెరిగిందని టాక్ వచ్చింది. అదే సమయంలో మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్.. సోషల్ మీడియాలో అల్లు అర్జున్ తోపాటు స్నేహా రెడ్డిని అన్ ఫాలో చేసినట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. దీనిపై మెగా ఫ్యామిలీ మెంబర్స్ ఎవరూ ఇప్పటి వరకు రెస్పాండ్ కాలేదు. అయితే నటి కమ్ నిర్మాత నిహారిక కొణిదెల తన సొంత సంస్థ ఎలిఫెంట్ పిక్సర్చ్ బ్యానర్ పై కమిటీ కుర్రోళ్ళు సినిమా నిర్మిస్తోంది. ఈ మూవీ టీజర్ రిలీజ్ ఈవెంట్ తో మీడియాతో పలు విషయాలపై మాట్లాడింది. ఆ సమయంలో ఓ మీడియా రిపోర్టర్..

మెగా ఫ్యామిలీలో ఓ హీరో అల్లు అర్జున్ ను అన్ ఫాలో అయ్యారన్న విషయాన్ని నిహారిక వద్ద ప్రస్తావించారు.మెగా, అల్లు ఫ్యామిలీలు కలిసే ఉంటాయి, కానీ ఎన్నికల వల్ల డిస్టర్బెన్స్ క్రియేట్ అయిన సమయంలో అన్ ఫాలో చేశారని వార్తలు వస్తున్నాయి.. ఎంత వరకు కరెక్ట్ అని అడిగారు.

దానికి నిహారిక..

ఆ విషయం గురించి తనకు నిజంగా తెలియదన్నారు. ఏదేమైనా ఎవరి కారణాలు వారికి కచ్చితంగా ఉంటాయని తెలిపారు. దీంతో నిహారిక వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ఆ మాటల బట్టి బన్నీని అన్ ఫాలో చేయడం నిజమేనని నెటిజన్లు చెబుతున్నారు.

# మిస్టర్ బచ్చన్ క్రేజీ అప్‌డేట్




టాలీవుడ్ మాస్ మహరాజా రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన టైటిల్ పోస్టర్‌లో రవితేజ తన ఫేవరేట్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ పోజ్‌లో కనిపిస్తూ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాడు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా షూటింగ్ సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. తాజాగా మూవీ కంప్లీట్ అయినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా దర్శకుడు హరీశ్ శంకర్ ఒక ప్రమోషనల్ వీడియో విడుదల చేశాడు. ఈ వీడియోలో రవితేజ అభిమాని వచ్చి హరీశ్ శంకర్‌ను నేను రవితేజ డై హార్డ్ ఫ్యాన్ అన్న అంటాడు. ఆ తర్వాత మూవీ నుంచి ఎదైనా అప్‌డేట్ ఇవ్వమని కోరతాడు. దీనికి హరీశ్ శంకర్ మాట్లాడుతూ.. షూటింగ్ అయిపోయింది. ఇక అప్‌డేట్‌లే మిగిలి ఉన్నాయి. గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌లు అవి అందరు ఇచ్చేవే మనం ఈసారి కొత్తగా ప్లాన్ చేద్దాం. ఈసారి ఒక షో రీల్ వదులుదాం. అందులో డైలాగ్స్ ఉండవు అంటూ హరీశ్ శంకర్ తెలిపాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. షాక్, మిరపకాయ్ సినిమా తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా వస్తుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

# చందమామ కథకు ప్రాణం పోసిన యక్షిణి



పురాణాల్లో మాత్రమే కనిపించే 'యక్షిణి' పాత్రను వెబ్‌సిరీస్‌గా రూపొందించారు. మాయ (వేదిక) ఒక యక్షిణి. శాపం కారణంగా భూమిపై ఉండాల్సి వస్తుంది. తమో రజో గుణంతో వందమంది పురుషులను అనుభవించి, వారిని హతమార్చిన తర్వాతే ఆమెకు శాపవిమోచనం కలుగుతుంది. 99 మందిని అలాగే హత్య చేస్తుంది. అయితే, 100వ వ్యక్తి మాత్రం నిష్ట కలిగిన బ్రహ్మచారి అయి ఉండాలన్నది షరతు. అలాంటి వ్యక్తి కోసం వెతుకుతున్న తరుణంలో కృష్ణ (రాహుల్ విజయ్) పరిచయం అవుతాడు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ ఉంటాడు. మరోవైపు క్షుద్ర, తాంత్రిక విద్యలతో యక్షిణిని వశం చేసుకోవాలని ఎదురు చూస్తుంటాడు మహాకాల్ (అజయ్). మరి యక్షిణితో పరిచయం అయిన తర్వాత కృష్ణ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ఈ క్రమంలో అతడికి ఎదురైన పరిస్థితులు ఏంటి? మహాకాల్ ఎందుకు యక్షిణిని వశం చేసుకోవాలని చూస్తున్నాడు? ఇవన్నీ తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే! పురాణాల్లో పాత్రల ఇతివృత్తంగా సినిమాలను తెరకెక్కించడం తెలుగు తెరకు కొత్తేమీ కాదు. మారిన పరిస్థితులకు వాటిని అన్వయించుకుంటూ రూపొందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారనేందుకు 'బింబిసార'లాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

# ప్రభాస్ చేయాల్సినది కన్నప్ప: మోహన్ బాబు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేయాల్సిన సినిమా కన్నప్ప అని అన్నారు మంచు మోహన్ బాబు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న కన్నప్ప చిత్రంలో మోహన్ బాబు ఒక కీలక పాత్రను పోషిస్తున్నారు. తాజాగా సినిమా టీజర్ లాంచ్ వేడుకలో ఆయన మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. ఈ వేదికపై దివంగత కృష్ణం రాజు తనతో అన్న మాటలను ఎంబి గుర్తు చేసుకున్నారువిష్ణు కోసం రైట్స్ ఇవ్వాలని తాను కోరగా, కన్నప్ప చిత్రాన్ని ప్రభాస్ తో తీస్తానని కృష్ణం రాజు అన్నారు. కానీ విష్ణు కోసం రైట్స్ ఇచ్చేస్తానని, అలాగే తాను డెవలప్ చేయించిన కంటెంట్ ని కూడా ఇచ్చేస్తానని అన్నట్టు తెలిపారు. ప్రభాస్ తో కన్నప్ప తెరకెక్కించే ప్రయత్నం గురించి గతంలో కూడా తనతో కృష్ణం రాజు అన్నారని కూడా మోహన్ బాబు తెలిపారు.నిజానికి రెబల్ స్టార్ కృష్ణం రాజు జీవించి ఉన్న కాలంలో ప్రభాస్ కోసం కొన్నేళ్ల పాటు కన్నప్ప స్క్రిప్ట్ కోసం శ్రమించారు. దీనిపై రచయితల బృందం పని చేసారు. ప్రభాస్ ని డైరెక్ట్ చేయాలని కృష్ణం రాజు కలగన్నారు. కానీ ఆ కల నెరవేరలేదు. బాహుబలి తర్వాత డార్లింగ్ ప్రభాస్ క్రేజ్ అమాంతం స్కైని తాకింది. దాంతో వరుసగా పాన్ ఇండియా సినిమాలే చేయాల్సొచ్చింది. పెదనాన్న దర్శకత్వంలో నటిస్తానని కూడా ప్రభాస్ అన్నాడు. కానీ కుదరలేదు. ఇంతలోనే ఆయన కల నెరవేరకుండానే కాలం చేసారు. బాహుబలి1, 2 తర్వాత సాహెూ, రాధేశ్యామ్, ఆదిపురుష్- సలార్ లాంటి భారీ పాన్ ఇండియా చిత్రాల్లో నటించాడు ప్రభాస్. ప్రస్తుతం నాగ్ అశ్విన్ తో కల్కి లాంటి భారీ ప్రయోగం చేసాడు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

# హద్దులు దాటిన అందాల నిక్కీ



హిందీ టెలివిజన్ నటి నిక్కీ తంబోలి సోషల్ మీడియా ద్వారా షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోల వల్ల ఎప్పుడూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెల్సిందే. తాజాగా మరోసారి ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఎప్పటిలాగే నిక్కీ అందాల జాతరకి ఫిదా అవుతున్నారు .చీకటి గదిలో చితక్కొట్టుడు సినిమా ద్వారా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడికి ఇప్పటికి సోషల్ మీడియాలో సందడి చేస్తూనే ఉంది. కాంచన 3 లో నటించిన ఈ అమ్మడు అందంతో అలరించింది. బిగ్ బాస్ సీజన్ 14 లో ఆకట్టుకున్న ఈ అమ్మడు రన్నరప్ గా నిలిచింది.2021 లో రియాలిటీ షో ఫియర్ ఫ్యాక్టర్ లో పాల్గొంది. ఇంకా పలు టీవీ షో ల ద్వారా నిక్కీ తంబోలి ఆకట్టుకుంది. మధ్య లో సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్ గా అందాల ఆరబోత చేస్తూ ఆకట్టుకుంటూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల విందు హద్దులు దాటింది.అందాల నిక్కీ తంబోలీ తాజాగా బ్లాక్ డ్రెస్ లో కన్నుల విందు చేసింది. థైస్ అందాలను చూపించడం ద్వారా నడుము అందాన్ని చూపించడం ద్వారా చూపు తిప్పుకోనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో అందాల ఆరబోత ఈమెకే సాధ్యం అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు.

# ఏడు జన్మలకు లావణ్య భర్త అతడే!



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్-లావణ్య త్రిపాఠి ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఐదారేళ్ల పాటు ప్రేమించుకుని పెద్దల్ని ఒప్పించి వివాహ బంధంతో ఒకటయ్యారు. ప్రస్తుతం వారి ధాంపత్య జీవితం సంతోషంగా సాగిపోతుంది. మెగా కోడలిగా అడుగు పెట్టిన తర్వాత ఆ ఇంటి బాధ్యతలు తీసుకుంది. అలాగని కుటుంబ సభ్యులెవరు? ఆమె స్వేచ్ఛకి భంగం కలిగించలేదు. ఆమెకు ఇవ్వాల్సినంత స్వేచ్ఛ ఇచ్చారు.ఎంచక్కా సినిమాలు చేసుకోమన్నారు. మంచి పాత్రలు వస్తే తప్పకుండా చేస్తానని కూడా లావణ్య రివీల్ చేసింది. భర్త నుంచి అన్ని రకాలుగా సహకారం లభిస్తుంది. లావణ్య తొలి నుంచి సినిమాల పరంగా కొన్ని నియమ నిబంధనలు విధించుకునే పనిచేసింది. గ్లామర్ పాత్రలకు ఎప్పుడూ దూరంగానే ఉంది. ఇప్పుడా డిస్టెన్స్ ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది. ఎంపికల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవరించే ఛాన్స్ ఉంది. అయితే లావణ్య త్రిపాఠికి పెళ్లి అయిపోయిందని ఓ అభిమాని ఫీలైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఓ నెటి జనుడు ఈ జన్మకి కుదరలేదు. వచ్చే జన్మలోనైనా మిమ్మల్ని పెళ్లి చేసుకుంటా? అని ఓ పోస్ట్ పెట్టాడు. దానికి లావణ్య తెలివైన సమాధానం ఇచ్చింది. పెళ్లిళ్లు స్వర్గంలో నిశ్చయించబడతాయి. నేను దాన్ని బలంగా నమ్ముతా. ఈ జన్మలోనే కాదు..ఏడు జన్మలకు అతనే నా భర్త గా వస్తారని నమ్ముతున్నాను. శిస్తున్నాను అని చెప్పుకొచ్చింది.ప్రస్తుతం ఈ పోస్టె నెట్టింట వైరల్ గా మారింది. ప్రస్తుతానికి లావణ్య త్రిపాఠి తెలుగులో సినిమాలేవి చేయలేదు. తమిళ్ లో మాత్రం థానల్ అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా లావణ్య పెళ్లికి ముందే కమిట్ అయింది. షూటింగ్ డిలే అవ్వడంతో ఆలస్యమవుతోంది.